ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 27 అక్టోబరు 2025 | 5



సాహిత్యం, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహం

- కవిసంధ్య దశాబ్ది ఉత్సవంలో మల్లాడి
- యానాంలో ఘనంగా శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానం 7

తుపానుపై ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష

» ఎస్పీ, కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి



అమలాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో జిల్లాలోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. తుపాను దృష్ట్యా కోనసీమ జిల్లాలోని కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనాలతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. తీరప్రాంత ప్రజలకు తుఫాన్‌పై అవగాహన కల్పించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేయాలని సూచించారు. కాల్వలు, చెరువులు, నదులను నిరంతరం పర్యవేక్షించేందుకు అధికారులను నియమించి ప్రమాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడా ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి విద్యుత్ సదుపాయంతోపాటు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

» కార్మికశాఖ మంత్రి సుభాష్



రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్మికశాఖ మంత్రి సుభాష్ కోరారు. ఈమేరకు తుఫాన్‌పై ఆయన కార్యాలయంనుంచి ప్రకటన విడుదల చేశారు. ఐఎండీ సూచనలతో విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ఈనెల 28,29 తేదీల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారన్నారు. తుపాను ప్రభావాన్నిబట్టి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.తీరప్రాంతాల్లో తుఫాన్ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాల కలెక్టర్లు, కృష్ణా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశామన్నారు. తుఫాను 28న రాత్రి కృష్ణా-విశాఖ మధ్య కాకినాడ సమీపంలో తీరం తాకే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొందని,90నుంచి 110కిలోమీటర్ల వేగంతో గాలులు వీయొచ్చని ప్రజలు సురక్షితంగా ఉండాలన్నారు. బోట్లు హార్బర్లలో నిలిపివేయాలని, లైఫ్‌జాకెట్లు, రెస్క్యూ పరికరాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశాలు జారీచేశామన్నారు.తీరప్రాంతాల ప్రజలను సురక్షితప్రాంతాలకు, తుపాను షెల్టర్లకు తరలించే చర్యలుచేపట్టామన్నారు. తుఫాన్ కారణంగా ఇబ్బందులుంటే కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేయాలన్నారు.



ముంచుకొస్తుందా : ఉప్పాడ కొత్తపల్లిలో ముందుకొస్తున్న సముద్రం

మొప్పుందా!

పొంచి ఉన్న తుఫాన్ ముప్పు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముంచుకొస్తోంది.. కాకినాడకు 880 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ముప్పు తప్పదని..110 కిలో మీటర్ల వేగంతో దూసుకొస్తోందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. కొన్ని గంటల్లో వాయుగుండంగా బలపడి మంగళవారం సాయంత్రానికి తీవ్ర తుఫాన్‌గా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం కాకినాడకు 880 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుఫాన్ ఉత్తర-వాయువ్య దిశగా కదులుతూ మంగళవారం రాత్రి తీరం దాటే అవ కాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యంత్రాంగం అప్రమత్తమైంది. రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని, భారీ నష్టాలు సంభవించే ప్రమా దం ఉందన్న హెచ్చరికలతో అధికారులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నారు. సిబ్బందిని అలర్ట్ చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం హోప్‌ఐలాండ్‌లో ఉన్న మత్స్యకార కుటుంబాలకు చెందిన 110 మందిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ మం డలం తూరంగిలో ఉన్న హోప్‌ఐలాండ్ కాలనీకి తరలించినట్టు కాకినాడ ఆర్డీవో మల్లిబాబు తెలిపారు.తీర గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాం తాలకు తరలిస్తున్నారు. బీచ్ రోడ్డుకి చేర్చి ఉన్న గృహాలను సైతం ఖాళీ చేయించారు. తుఫాన్ సహాయక చర్యల నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసింది. తూర్పుగోదావరి జిల్లాకు రూ.50 లక్షలు కేటాయించారు.

విద్యుత్‌శాఖ సంసిద్ధం

ఏపీఈపీడీసీఎల్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యల పర్యవేక్షణకు కార్పొరేట్ కార్యాలయం నుంచి సీజీఎం, ఎస్ఈ, ఈఈ, డీఈఈలకు బాధ్యతలు అప్పగించారు. అత్య వసర సేవలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.పోల్స్,ఇతర సామగ్రిని తుఫాన్ ప్రభావ జిల్లాలకు తరలించే పనిలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు.

- » ఉమ్మడి జిల్లాలో రేపు అలజడి
- » కాకినాడలో తీరం దాటే అవకాశం
- » యంత్రాంగాలు అప్రమత్తం
- » కాకినాడ తీరంలో రెడ్ అలర్ట్
- » ఉప్పాడ బీచ్‌కు రాకపోకల బంద్
- » స్కూళ్లు, కాలేజీలకు సెలవులు
- » ఉద్యోగులకు సెలవులు నిలుపుదల
- » ఇళ్లకు తరలిన హాస్టల్ విద్యార్థులు
- » ఏజెన్సీలోనూ అప్రమత్తం
- » పాపికొండల పర్యటన నిలుపుదల
- » ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లు

బీచ్ రోడ్డులో రాకపోకలు బంద్

తుఫాన్ హెచ్చరికలతో ఆదివారం సాయంత్రం నుంచి కాకినాడ- ఉప్పాడ బీచ్ రోడ్డులో రాకపోకలు నిలిపివేశారు. బీచ్ రోడ్డుకు ఇరువైపులా పోలీసు బందోబస్తు చేపట్టారు. వాహనాలు అటుగా వెళ్లకూడదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సముద్రస్నానానికి వెళ్లే భక్తులు బీచ్‌కు వెళ్లకూడదని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు. మత్స్యకారులెవరూ వేటకు వెళ్లవద్దంటూ మత్స్యకార గ్రామాల్లో రెవెన్యూ యంత్రాంగం టాంటాం వేయించింది.

ఏజెన్సీలో అప్రమత్తం
పాపికొండల పర్యటన నిలుపుదల

దేవీపట్నం/రంపచోడవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ కారణంగా పాపికొండలు పర్యటన తాత్కాలికంగా నిలిపివేసినట్టు సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ ఆదివారం తెలిపారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా దేవీపట్నం మండలం పోశమ్మ గండి ఫెర్రీ పాయింట్ వద్ద పాపికొండల పర్యాటక బోటు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. పర్యాటకులు,బోటు యాజమాన్యం, బోటు సిబ్బంది ఆదేశాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. రానున్న మూడురోజుల్లో మొంథా తుఫాన్ ప్రభా వంతో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ఏజెన్సీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉందన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాల యంలో కంట్రోల్ రూమ్ నెంబర్లు 630772025, 08864-243561ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యా సంస్థలకు అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా 28,29 తేదీల్లో సెలవులు ప్రకటించారు.



హాస్టళ్ల నుంచి ఇళ్లకు బయలుదేరిన విద్యార్థులు

బడులు బంద్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కాకినాడ జిల్లాకు సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ శుక్రవారం వరకు ఐదు రోజుల పాటు విద్యాశాఖాధికారులు సెలవులు ప్రకటించారు. కోనసీమ , తూర్పుగోదావరి జిల్లాలకు 27,28,29 తేదీల్లో సెలవులు ప్రకటించారు. ఎట్టిపరిస్థితుల్లోను తదుపరి సమాచారం ఇచ్చే వరకు పాఠశాలలను తెరవొద్దని ఆదేశించారు. ఉపవిద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాఠశాల రికార్డులన్నీ సురక్షితంగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించడంతో ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. కొన్ని పాఠశాలలను తుఫాన్ పునరావాస కేంద్రాలుగా సిద్ధం చేస్తున్నారు.హాస్టళ్లలోని విద్యార్థులను ఇళ్లకు పంపేశారు.అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉద్యోగులకు సెలవుల్లేవు..

ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించారు. అతి పెద్ద తుఫాన్‌గా వాతావరణశాఖ హెచ్చరించడంతో అన్నిశాఖల అధికారులు, సిబ్బంది అప్ర మత్తంగా ఉండాలని, తుఫాన్ సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని, నష్ట నివారణ లేకుండా సన్నద్ధం కావాలని అధికారులు ఆదేశి స్తున్నారు. రానున్న నాలుగు రోజులూ ఎటువంటి సెలవులు ఉన్నా.. వాటిని రద్దు చేసుకుని విధులకు తప్పకుండా హాజరుకావాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను రద్దు చేశారు.

తుఫాన్ వస్తే ఏం చేయాలి..

- అధికారుల సమాచారం కోసం మొబైల్ ఫోన్లు అందుబాటులో ఉంచుకోవాలి. అత్యవసర ఎస్ఎంఎస్‌లను చూడాలి. సమాచారాన్ని గుర్తించాలి. ప్రమాదకరంగా ఉంటే వెంటనే అప్రమత్తం కావాలి.
- అధికారుల సూచనల ప్రకారం సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు వెళ్లాలి.
- పుకార్లు, వదంతులు నమ్మకూడదు.
- బయటకు వెళ్లకూడదు. ప్రమాదకర ప్రాంతాలకు అసలు వెళ్లకూడదు. పాతభవనాలు, చెట్లు, విద్యుత్‌వైర్లు వంటి ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
- భారీవర్షాల సమయంలో ఎలక్ట్రిక్ మెయిన్ స్విచ్ఆఫ్ చేయాలి. అన్ని ఎలక్ట్రిక్ గృహోపకరణాలను ప్లగ్ నుంచి తీసేయండి.
- మత్స్యకారులు వేటకు వెళ్లకూడదు.
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. భవనాలపై సెల్ టవర్లు ఉంటే జాగ్రత్తగా ఉండాలి. అవి కూలితే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. అనుమానం ఉంటే వెంటనే అధికారులకు సమాచారమివ్వాలి.
- అత్యవసర సహాయ నెంబర్లు 112, 1070, 18004250101 నెంబర్లను సంప్రదించాలి.

విద్యాసంస్థలకు మూడురోజులు సెలవు

ముమ్మిడివరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు తుఫాన్ ముప్పు పొంచి ఉన్నందున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు 27, 28, 29 తేదీల్లో సెలవులు ప్రకటించామని డీఈవో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు అందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించామన్నారు.

తుపాను ప్రత్యేకాధికారిగా విజయరామరాజు

అమలాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుపాను పరిస్థితులను పర్యవేక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సీనియర్ ఐఏఎస్ అధికారి విజయరామరాజును నియమించింది. జిల్లాలో ఉండి తుపాను పరిస్థితులను ఆయన పర్యవేక్షించనున్నారు. జోనల్ ఇన్‌చార్జిగా ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి అజయ్ జైన్‌ను నియమించింది. తుపానుకు సంబంధించిన జిల్లాలో చేపడుతున్న చర్యలు, సహాయక కార్యక్రమాలు, ఇతర పరిస్థితులను వీరు పర్యవేక్షించనున్నారు.

ఎగసిపడుతున్న అలలు

అల్లవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను పొంచి ఉన్న హెచ్చరికల నేపథ్యంలో తీరగ్రామాలకు ముప్పుతో పాటు ప్రజల్లో ఆందోళననెలకొంది. సముద్రతీరంలో గాలులకు తోడు అలల తాకిడి పెరిగింది. అల్లవరం ఎస్ఐ సంపత్‌కుమార్, ఓడలరేవు మెరైన్ అధికారులు ఆదేశాలతో సముద్రతీర సందర్శనకు ప్రజలు వెళ్లకుండా ప్రజలు కట్టుదిట్టం చేశారు. తుఫాన్ పొంచి ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ దండోరాలు వేయించినట్టు తహశీల్దార్ నరసింహారావు తెలిపారు.

అధికార యంత్రాంగం సర్వసన్నద్ధం

- » 27, 28, 29 తేదీల్లో జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవు
- » తీరప్రాంతాల్లో 3వేల విద్యుత్ స్తంభాలను సిద్ధంగా ఉంచండి
- » కలెక్టర్ మహేష్‌కుమార్
- » తీరప్రాంత గ్రామాల్లో తుఫాన్ షెల్టర్ల పరిశీలన



తీరప్రాంతంలో తుఫాన్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని, రానున్న నాలుగురోజుల్లో జిల్లాలో అతిభారీవర్షాలు కురవడంతోపాటు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు.కలెక్టరేట్‌లో ఆదివారం జరిగిన విలేఖరుల సమావేశంలో జిల్లాలో తుఫాను సన్నద్ధతపై అధికారయంత్రాంగం తీసుకున్న చర్యలు, చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 27నుంచి మూడురోజులపాటు తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని తీరప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తంచేయడంతోపాటు క్షేత్రస్థాయిలో ఉద్యోగులకు విపత్తును ఎదుర్కొనేందుకు విధులు కేటాయిస్తున్నామన్నారు. సముద్రతీరం వెంబడిఉన్న గ్రామాల్లో తుపాను షెల్టర్లను సిద్ధం చేసి అత్యవసర పరిస్థితుల్లో ప్రజల్ని వాటిలోకి తరలించి వసతిని కల్పించేందుకు సమాయత్తం చేశామన్నారు. తీరం వెంబడి 34 ఆవాసాల్లో 6వేలమంది ప్రజలు ఉన్నారని, వారిని తుఫాన్ హెచ్చరికలకు అనుగుణంగా తరలించేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్టు చెప్పారు. రాబోయే 15 రోజుల్లో ప్రసవ తేదీలు ఉన్న 428మంది గర్భిణులను గుర్తించి పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు తరలిస్తామన్నారు. జిల్లాలో 90 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, మూడు కిలోమీటర్లకు ఒక ఇన్‌చార్జిని, సిబ్బందిని నియమించినట్టు చెప్పారు. హెచ్చరికలకు అనుగుణంగా మెరైన్ పోలీసుల సమన్వయంతో సహాయక చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. బీచ్‌ల్లో ఎవరూ తిరగవద్దని, చేపలవేటకు వెళ్లిన మత్స్య కారులు తక్షణమే తీరాలకు చేరుకోవాలని,జిల్లా కేంద్రం, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని చెప్పారు. తుపాను సహాయ చర్యల నిమిత్తం ఒక ఎన్డీఆర్ఎఫ్ బృందం సిద్ధంగాఉందని, మరో బృందం వస్తోందని తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ 3వేల విద్యుత్ స్తంభాలు,ట్రాన్స్‌ఫార్మర్లు, మెటీరియల్స్‌ను సిద్ధం చేసి విద్యుత్ పునరుద్ధరణకు సబ్‌స్టేషన్లలో భద్రపరచాలని, పవర్ రంపాలు, ఎక్స్‌కవేటర్లు, క్రేన్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో 27, 28, 29 తేదీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తున్నామన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము పనితీరును పరిశీలించారు.

ప్రజలను తరలించేందుకు చర్యలు: జేసీ

అల్లవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుపానుతో పొంచిఉన్న హెచ్చరికల నేపథ్యంలో కోనసీమ తీర మండలాల్లో అన్నిశాఖల అధికారులను అప్రమత్తం చేశామని జేసీ టి.నిషాంతి అన్నారు. అల్లవరం మండలం ఓడలరేవులో తుపాను షెల్టర్‌ను ఆదివారం ఆమె పరిశీలించి సూచనలు చేశారు. కోనసీమ తుపాను ప్రభావిత తీరగ్రామాల్లో ముందస్తుగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేశామని, ఎస్జీఆర్ఎఫ్ బృందాలను రప్పిస్తున్నామని అన్నారు. తుపాను షెల్టర్లతోపాటు సమీప పాఠశాలల భవనాల్లోకి ప్రజలను తరలించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కంట్రోల్ రూముల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశామన్నారు. తీరగ్రామాల్లో రోడ్ల పరిస్థితి తుపాను వస్తే వారికి ఆహార సరఫరా, తాగునీరు, రోడ్ల పరిస్థితి, పశుసంరక్షణ చర్యలపై జేసీ అధికారులతో సంప్రదించారు. ఆ సమయాల్లో గర్భిణులు ఉంటే వారిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అల్లవరం మండలంలో ఆరు కోస్తా గ్రామాల్లో తుపాను ప్రభావం పరిస్థితులు ఉండే అవకాశం ఉందని తహశీల్దార్ నరసింహారావు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి అధికారి డి.రాంబాబు, మండల ప్రత్యేకాధికారి కర్నీడి మూర్తి, తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావు, ఎంపీడీవో గౌరీ దేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జి.స్వామి, డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర, మల్లాడి ఉమామహేశ్వరరావు, పశువైద్యాధికారి మేడిద నారాయణ రావు, ఎస్ఐ బి.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.



అల్లవరం మండలం ఓడలరేవులో తుఫాను షెల్టర్‌ను పరిశీలించి సూచనలిస్తున్న జేసీ నిషాంతి

అట్టర్..ప్లాట్లు!

- » అంచనాలు తలకిందులు
- » అంతంతమాత్రమే స్పందన
- » ముగిసిన ఎల్ఆర్ఎస్ గడువు
- » మళ్లీ గడువు పొడిగించేనా?

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తిగత లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు ఇచ్చిన 90 రోజులు గడువు ముగిసింది. గతంలో అవకాశం ఇచ్చినా అర్ధంతరంగా నిలిపివేసింది. ఈ సారి పూర్తిస్థాయిలో 90రోజులు గడువిచ్చినా పథకానికి తొలినుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో స్పందన అంతంత మాత్రంగానే ఉంది. భారీగా దరఖాస్తులు వస్తాయన్న పాలకులు, అధికారుల అంచనాలు తలకిందులయ్యాయి. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ జిల్లాలోని అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కౌడా), పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా), తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (రుడా), బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) పరిధిలో 10,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ అర్ధంతరంగా నిలిపివేసి దీనికి కొన్ని సవరణలు చేసి 2025, జూన్ 30వ తేదీలోపు రిజిస్టర్ అయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లు అర్హత కలిగినవిగా సవరిస్తూ జీవో ఎంఎస్ నెంబరు 134ను 2025, జూలై 26న జారీ చేసిన నాటి నుంచి 90రోజులు అంటే అక్టోబరు 24వ తేదీలోపు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది.ఆ గడువు ముగిసినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని అధికారులు అంచనా వేస్తున్నారు.



మళ్లీ గడువు పొడిగించేనా?

ఎల్ఆర్ఎస్ గడువు ముగిసింది. ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందా.. గడువును పొడిగిస్తుందా.. అన్న సందేశాలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు సైతం వచ్చిన దరఖాస్తులపై సంతృప్తి చెందకపోవడంతో గడువు పెంపునకు కృషి చేస్తారన్న చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన గడువులో పూర్తిస్థాయిలో అక్రమ లేఅవుట్లు యజమానుల క్రమబద్ధీకరణకు వచ్చి ఉంటే ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లు జమయ్యే అవకాశం ఉండేదని అధికారులు అంటున్నారు.

మొక్కుబడిగానే దరఖాస్తులు..

గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వేసి వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున గండి పడడంతో పాటు స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి మూడు నెలల గడువిస్తూ అక్రమ లేఅవుట్లు, అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. లేఅవుట్ల యజమానులు క్రమబద్ధీకరణకు పెద్దగా ఆసక్తి చూపలేదు. కాకినాడ(కౌడా) పరిధిలో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) పరిధిలో 1,005 దరఖాస్తులు క్రమబద్ధీకరణకు లేఅవుట్ల, ప్లాట్ల యజమానులు ముందుకు వచ్చారు. వీటిలో ఎక్కువగా ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులే ఉన్నాయి. ప్రభుత్వం అవకాశం కల్పించినా పూర్తిస్థాయిలో ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అందరూ ముందుకు రాలేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దూసుకొస్తున్న తుఫాన్

» అన్నదాత గుండెల్లో గుబులు

పి.గన్నవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దూసుకువస్తుండడంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. కోనసీమ, కాకినాడ జిల్లాల పరిధిలో తుఫాన్ తీరం దాటనుండడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందనివారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈసారి మొదటిపంటకు 70శాతం 1318,మిగిలిన 30శాతం స్వర్ణ, 333రకాలను రైతులు ఎంపిక చేసుకున్నారు. ప్రస్తుతం పంట పూత, పాలు పోసుకునే, గింజ గట్టిపడే దశల్లోఉంది. ఈనేపథ్యంలో నిరంతరంగా వర్షాలు పడితే గింజ మొలక వచ్చే అవకాశం ఉందని, పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మూడు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు సీజ్

ముమ్మిడివరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన కింద మూడు ప్రైవేటు ట్రావెల్ బస్సులను సీజ్ చేశామని, మరో నాలుగింటిపై ఇతర కేసులు నమోదు చేశామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజావద్ద నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మూడు ప్రైవేటు ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు చేసి వాటిని సీజ్ చేసి ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు. మరో నాలుగు ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేసి రూ.20వేల అపరాధ రుసుమును విధించామన్నారు. సీజ్ చేసిన మూడు బస్సుల్లో అనధికారికంగా సీట్లు మార్పిడి చేసినట్టు గుర్తించామన్నారు. మోటారు వాహనాలచట్టం ఉల్లంఘన కింద ఈ మూడు బస్సులను సీజ్ చేశామన్నారు. ఇవి యానాంనుంచి హైదరాబాద్‌కునడుపుతున్నారన్నారు. జిల్లాలో ప్రతివారం ప్రైవేటు ట్రావెల్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఇకపై వారంలో రెండుసార్లు తనిఖీ చేస్తామని తెలిపారు.బస్సు భద్రతా ప్రమాణాలు, రహదారి భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రత్యేకతనిఖీలు నిర్వహిస్తామన్నారు. భద్రతా ప్రమాణాల ఉల్లంఘనను ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదన్నారు. భద్రతాప్రమాణాలు ఉల్లంఘించిన విషయమై కేసులు నమోదుచేసి వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు.తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతిసురేష్, కౌశిక్‌లు పాల్గొన్నారు.



ప్రైవేటు ట్రావెల్ బస్సును తనిఖీ చేస్తున్న జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు

సత్యదేవుడి సన్నిధిలో భక్తుల రద్దీ



అన్నవరంలో వ్రతాలాచరిస్తున్న భక్తులు, రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 3 గంటల నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించారు. ఆదివారం సుమారు 5వేల జంటలు వ్రతాలాచరించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.35 లక్షల ఆదాయం లభించింది. దేవదాయ కమిషనర్ ఆదేశాలతో ఆలయంలో నిబంధనలను కఠినంగా అమలుచేశారు. పశ్చిమ రాజగోపురం వద్ద చిన్నద్వారాన్ని మూసివేశారు. సిబ్బంది తరుపున వచ్చినవారిని కూడా జనరల్ క్యూ లైన్ ద్వారానే అనుమతించారు. చైర్మన్ రోహిత్ పశ్చిమరాజగోపురం వెనక భాగంలో ఉండి దళారులు ఎవ్వరూ దరిచేరకుండా పర్యవేక్షణ చేశా రు. ఈవో సుబ్బారావు ప్రధానాలయం, వ్రతమండపాల వద్ద రద్దీ నియంత్రణకు ఆదేశాలిచ్చారు. వాహనాలను నిర్దేశితప్రాంతంలో మాత్రమే పా ర్కింగ్‌కు అనుమతించారు. సత్యదేవ నిత్యన్నదాన పథకం ద్వారా సుమారు 6వేల మందికి ఉచిత పులిహోర దద్దోజనం అందించారు. రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవ రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు రథంవెంట నడి చి స్వామిసేవలో పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో..



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

ఆత్రేయపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక ఆది వారం వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. నిత్యాన్నదాన పథకానికి గణపవరానికి చెందిన కొండేటి వెంకటరత్నం రూ.30,116.. రాజమహేంద్రవరానికి చెందిన భూపతిరాజు సాయిశరత్‌వర్మ రూ. 36,500 విరాళాలు సమర్పించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఎస్పీ శ్రీరామ రాహుల్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు అందించారు. వారికి అర్చక బృందం వేద మంత్రాలతో స్వాగతం పలకారు. ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఎస్పీ దంపతులకు చిత్రపటం అందిస్తున్న డీసీ

30 రోజులు.. 100 ప్రసవాలు!

- రికార్డు సృష్టించిన చింతూరు ఏరియా ఆసుపత్రి
- వైద్యులను అభినందించిన ఐటీడీఏ పీవో



చింతూరు ఆసుపత్రిలో ప్రసవ మహిళల వార్డు



చింతూరు ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

చింతూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 30 రోజుల్లో 100 ప్రసవాలతో అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని చింతూరు ఏరియా ఆసుపత్రి రికార్డు సృష్టించింది. దీంతో ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ ఆదివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, గైనకాల జిస్టులు డాక్టర్ రమణారావు, డాక్టర్ శశికళను అభినందించారు. మొన్నటి వరకు గర్భిణులకు ప్రసవ తీరులో కాసింత సమస్య ఉందంటే చాలు ఇక్కడ నుంచి తెలంగాణలోని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి హుటాహుటిన తరలించేవారు. ఈ క్రమంలో గర్భిణులతో సహా ఆయా కుటుంబాలు నానా అవస్థలు పడాల్సివచ్చేది. ఒక్కోసారి ప్రాణాంతక పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చేది. అంతేకాక పలు సందర్భాల్లో పరిస్థితి విషమించడం, అక్కడి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి రావడం తదుపరి పేద, ఆదివాసీ కుటుంబాలు ఆసుపత్రుల బిల్లుల కోసం అప్పుల పాలైన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల చింతూరు ఆసుపత్రిని ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పాటుగా అదే దశలో ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రధానంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి స్వయంగా అనస్థీసియా డాక్టర్ (మత్తు మందు వైద్యుడు) కావడం అదేదశలో ఇరువురు గైనకాల జిస్టులను ప్రభుత్వం ని యమించడంతో ప్రసవ వైద్యసేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. అం తేకాకుండా ప్రసవాలకు తెలంగాణకు తరలించాల్సిన అవసరం దాదాపు లేకండా పోయింది. ఇటీవల ప్రసవాలపై ఆసుపత్రి సూప రింటెండెంట్ కోటిరెడ్డి బృందం ప్రత్యేక దృష్టి సారించింది. మరోవైపు సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక ప్రత్యేక వసతులతో కూడిన నవజాతి శిశు కేంద్రం (ఎస్ఎన్‌సీయూ) ఏర్పాటుచేయడం ఆ మేరకు ప్రత్యేక వైద్యనిపుణుడిని నియమించడంతో శిశుమరణాల సంఖ్య గణనీ యంగా తగ్గింది. ఈ క్రమంలో ఈ ఏడాది జనవ రిలో 64, ఫిబ్రవరి 48, మార్చి 50, ఏప్రిల్ 68, మే 48, జూన్ 54, జులై 50, ఆగస్టు 92, సెప్టెంబరు 95, ఇక సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 26 వరకు 30 రోజుల్లో 100 ప్రసవాల టార్గెట్‌ను సాధించి జిల్లా రికార్డును సొంతం చేసుకోవడంతో ఉన్నతాధికారుల నుంచి ఆసుప త్రి వైద్యులు,సిబ్బంది అభినందనలు అందుకున్నారు.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు

న్యాయనిర్ణేతగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

అమలాపురం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మంగుళూరు ఇంటర్నేషనల్ టాలెంట్ బ్యాడ్మింటన్ టోర్నమెంటుకు న్యాయ నిర్ణేతగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు శివారు కొంకాపల్లికి చెందిన పాయసం శ్రీనివాసరావుకు అవకాశం దక్కింది. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు ఆదివారం ఆయన తెలిపారు. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్, బ్యాడ్మింటన్ ఆసియా అసోసియేషన్, కర్ణాటక బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగుళూరులో ఈపోటీలు నిర్వహిస్తారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గ్రేడ్-1 నేషనల్ ఎంపైర్‌గా వ్యవహరిస్తున్న పాయసం శ్రీనివాసరావు ప్రస్తుతం నల్లచెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. మంగుళూరులో టోర్నమెంట్ ఈనెల28 నుంచి నవంబరు 2వరకు ఉరవ ఇండోర్ స్టేడియంలో జరుగుతుందన్నారు. న్యాయ నిర్ణేతగా మరోసారి నియమితులైన శ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకమ్మచౌదరి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి బాలు, కోనసీమ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమణబాబు అభినందించారు.

సాహిత్యం, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహం అందించాలి

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

యానాంలో కవిసంధ్య దశాబ్ది ఉత్సవం



యానాంలో కవిసంధ్య ప్రత్యేక సంచికను అవిష్కరిస్తున్న అతిథులు

యానాం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సాహిత్యం, కళా, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహం అందించాల్సిన ఆవశ్యకత ఉందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం యానాం అంబేడ్కర్ నగర్ కల్యాణమండపంలో కవిసంధ్య సాంస్కృతిక సంస్థ దశాబ్ది ఉత్సవం, శిఖామణి సాహిత్య పురస్కారాల ప్రదానం జరిగింది. కవిసంధ్య అధ్యక్షుడు కళారత్న డాక్టర్ శిఖామణి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా మల్లాడి మాట్లాడుతూ కవులు, రచయితలు సమాజాన్ని చైతన్యవంతం చేస్తారన్నారు. వారి రచనలు పుస్తక రూపంలోకి తీసుకురావడానికి కొంతమంది ఇబ్బంది పడతారని, అటువంటి కవులకు ఆర్థికంగా ప్రోత్సాహం అందించాలన్నారు. వచ్చే ఏడాది నుంచి ముగ్గురు స్థానిక కవులకు, మరో ముగ్గులు ఆంధ్ర, తెలంగాణకు చెందిన కవులకు పుస్తకాల ముద్రణకు ఆర్థిక సహాయం, అలాగే కవిసంధ్య కార్యక్రమాలను తోడ్పాటు అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కవులు దాట్ల దేవదానం రాజు, వరుగు భాస్కరరెడ్డి, డానియల్ నెజర్స్, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ కాళ్లకూరి శైలజ, బొల్లోజు బాబా, కుంచే నాగసత్యనారాయణ మాట్లాడారు. ఈ సందర్భంగా కవిసంధ్య-56 ఆరుద్ర బైరాగీ శత జయంతి సంచికను మల్లాడి కృష్ణారావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ రచించిన సదా స్మరణీయులు సంచికను డెనియల్ నెజర్స్ ఆవిష్కరించారు.

సమాజం చైతన్యవంతానికి సాహిత్యం బాసట : ఇనాక్

సమాజం చైతన్యవంతంగా పురోగమించడానికి సాహిత్యం బాసటగా నిలుస్తుందని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శిఖామణి పదేళ్లుగా కవిసంధ్య పత్రికను ఒంటిచేత్తో విజయవంతంగా వెలువరించడం అభినందనీయమన్నారు. యానాంలో సాహిత్య, కళారంగాలకు మ ల్లాడి కృష్ణారావు సహకారం అందించడం చాలా గొప్ప విషయమన్నారు. సాహితీపరంగా యా నాం మరింత పురోగతి సాధించగలదని ఆకాంక్షించారు. శిఖామణి తన మనమడు కోసం రాసిన కవితలు చదివానని, చిన్న పిల్లవాడిని అయ్యానని, శిఖామణి కవిత్వం అంతగా కదిలిస్తుందని తెలిపారు. ఈ సభ మంచి అనుభూతిని మిగిల్చిందన్నారు.

శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానం

సాహిత్యంలో జీవన సాఫల్యం కృషికి ఇచ్చే శిఖామణి సాహితీ పురస్కారాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు, అలాగే కవిత్వంలో యువ కవులకు ఇచ్చే శిఖామణి యువ పురస్కారాన్ని అవధానుల మణిబాబుకు మల్లాడి అందజేశారు. పూలమాలలు, శాలువా, మెమెంటో, సన్మానపత్రంలో సత్కరించి నగదు బహుమతి అందజేశారు. సన్మాన గ్రహీతలు తమ స్పందన తెలిపారు.

పదిమందికి కవిసంధ్య ప్రతిభా పురస్కారాల ప్రదానం

వచన, అభ్యుదయ, పత్రికా, లఘుకవిత, దళితసాహిత్యం తదితర అంశాల్లో పది మందికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఎస్.ఆర్.పృథ్వీ (దీర్ఘకవితలు), పీఆర్ఎల్‌స్వామి (కవిత్వధారణ), బీహెచ్‌వీ.మంగేష్ (పత్రికారంగం), పచ్చిమాల శివనాగరాజు (పద్య కవిత్వం), డాక్టర్ వరగు భాస్కరరెడ్డి (పరిశోధన), కోయి కోటేశ్వరరావు (దళిత సాహిత్య విమర్శ), పుప్పాల సూర్యకుమారి (నవల సాహిత్యం), పొనుగుమట్ల అశోక్‌కుమార్ (వచన కవిత్వం), పెనుమాక రత్నాకర్ (కథా సాహిత్యం), మిరప మహేష్ (వచనకవిత్వం)లకు కవిసంధ్య ప్రతిభా పురస్కారాలను అందించి ఘనంగా సత్కరించారు. ఇనాక్ సాహిత్యంపై డాక్టర్ కోయి కోటేశ్వరరావు, అవధానుల మణిబాబు కవిత్వంపై డాక్టర్ కాళ్లకూరి శైలజ మాట్లాడారు. ఈ సందర్భంగా శిఖామణి మాట్లాడుతూ ప్రతీ ఏటా అందించే పురస్కారాలకు కమిటీ ద్వారా కవులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మల్లాడి కృష్ణారావు సౌజన్యంతో పురస్కారాలను ప్రదానం చేసినట్టు తెలిపారు. పదేళ్లుగా కవిసంధ్య పత్రికను ఎన్నో కష్టనష్టాలకోర్చి వెలువరిస్తున్నట్టు తెలిపారు. కవిసంధ్యకు అండగా నిలుస్తున్న మల్లాడికి కృతజ్ఞతలు తెలిపారు. కవులు మదునాపంతుల సత్యనారాయణమూర్తి, రచయితలు పాల్గొన్నారు.

తుఫాన్ ఎఫెక్ట్

సఖినేటిపల్లి రేవులో రాకపోకల నిలిపివేత

అంతర్వేది, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాకపోకలు నిలిపివేశారు. గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలకు ఏ ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో పంటు ప్రయాణాలు తాత్కాలికంగా రద్దు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. తుఫాను తీవ్రతన ఆధారంగా తదుపరి రాకపోకలు సమచారం ప్రయాణికులకుతెలియచేస్తామన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి



మరణించిన చిట్టెమ్మ

జగ్గంపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గుర్రపాలెం గ్రామ శివారు జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. వివరాల్లోకి వెళితే సాగరపేటకు చెందిన నక్క వెంకన్న తన భార్య చిట్టెమ్మ(42) కలిసి ఆదివారం ఉదయం గ్రామం నుంచి జగ్గంపేట పనికి వెళ్లారు. ముగించుకుని తిరిగి తమ మోటార్‌సైకిల్‌పై ఇంటికి వచ్చే క్రమంలో గుర్రప్పాలెం గ్రామ శివారున ట్రాక్టర్ ఢీకొంది. తీవ్ర గాయాలైన చిట్టెమ్మను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా మరణించినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలులో షష్ఠి ఉత్సవాలకు రాట ముహూర్తం

బిక్కవోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన సతీమణి మహాలక్ష్మితో కలసి పందిరిరాట వేసి ఉత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే దంపతులు ముందుగా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి అనంతరం పందిరిరాట వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తూర్పు చాళుక్యులు త్రిమందిర్ పేరుతో బిక్కవోలులోని లక్ష్మీగణపతి, గోలింగేశ్వర ఆలయాలు, గొల్లలమామిడాడలోని సూర్యనారాయణస్వామి ఆలయాలను కేంద్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రసాద్ పథకంలో రూ.92.5 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. నవంబరు 25 నుంచి డిసెంబరు 2 వరకూ షష్ఠి ఉత్సవాలు నిర్వహిస్తామని, నవంబరు 26న స్వామి వారి షష్ఠి ఉత్సవం జరుపుతామని షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, రావాడ నాగు, ఇందల వీరబాబు, చాగంటి సాయిబాబారెడ్డి. బేరా వేణమ్మ, జుత్తుగ సూర్యకుమారి, రెడ్డి నాగవేణికుమారి, నడింపల్లి సూర్యకుమారి, పడాల రాము, తనుకు శ్రీధర్, పలువురు అధికారులు ఉన్నారు.



బిక్కవోలులో షష్ఠి ఉత్సవాలకు రాట వేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు

పిఠాపురంలో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు 36 మంది క్రీడాకారులు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పిఠాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ పోటీలను ఆదివారం పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రౌండ్ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ మెన్, ఉమెన్ విభాగాల్లో జరిగిన పోటీల్లో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ ప్రథమ స్థానంలో పిఠాపురం, ద్వితీయ స్థానంలో రాజమహేంద్రవరం, తృతీయ స్థానంలో కాకినాడ క్రీడాకారులు నిలిచారు. ప్రతిభ ఆధారంగా 36 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు నవంబరు 1, 2, 3న విజయవాడలో జరిగే పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. విజేతలకు ప్రిన్సిపాల్ వి.కేశవరావు, ఏపీ ఇంటర్మీడియట్ నాన్ గెజిటెట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.సురేష్‌కుమార్, కె.పద్మనాభం, రమణ, చిన్నబ్బాయి బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు న్యాయనిర్ణేతలుగా ముమ్మిడి గణేష్, జి.శివప్రసాద్,పి.పవన్ వ్యవహరించారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఎద్దులు అక్రమంగా కబేళాకు తరలింపు

ఇద్దరి అరెస్ట్



వ్యాన్‌లో తరలిస్తున్న ఎద్దులు

రాయవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎద్దులను అక్రమంగా కబేళాకు తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్ బాబు ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా జగ్గంపేట సంత నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి అక్కడి నుంచి ఐషర్ వ్యాన్‌లో నెల్లూరుకు అక్రమంగా 16 ఎద్దులు, 14 దూడలను తరలిస్తుండగా రాయవరం పోలీసులు తనిఖీలు చేసి పట్టుకున్నారు. రామచంద్రపురం శివారు కొత్తురుకు చెందిన సంసేను, రామచంద్రపురానికి చెందిన వెట్రివేల్‌ను అదుపులోకి తీసుకున్నారు. టీఎన్ 66ఏబీ 8740 ఐషర్ వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఎద్దులు, దూడలను సామర్లకోట గోశాలకు తరలించి వ్యాన్‌ను సీజ్ చేసినట్టు ఎస్ఐ డి.సురేష్ బాబు తెలిపారు.

ఒడిసా టు కోయంబత్తూరు..

గంజాయి తరలిస్తుండగా పట్టివేత

రూ. 8 లక్షల విలువైన సరుకు స్వాధీనం

ఆటో, లారీ సీజ్... ముగ్గురిపై కేసు



నిందితులతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్న అధికారులు

కొవ్వూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒడిసా ప్రాంతం నుంచి కోయంబత్తూరుకు తరలిస్తున్న 172 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తూర్పుగోదావరి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్.లావణ్య తెలిపారు. కొవ్వూరు గామన్ వంతెన దిగువన దొమ్మేరు రోడ్డులో ఆటో నుంచి లారీలోకి గంజాయి ఎక్కి స్తున్నారని కొవ్వూరు ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి ఎక్సైజ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి తీసుకువచ్చిన ఆటో, రవాణా చేస్తున్న లారీలను సీజ్ చేసి 86 ప్యాకెట్లలో ఉన్న 172 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి డొంకరాయికి చెందిన ఆటోలో డ్రైవర్ గంజాయిని కొవ్వూరు తీసుకువచ్చాడు. ఇక్కడి నుంచి కొయంబత్తూరుకు తరలించేందుకు లారీలో ఎక్కిస్తుండగా డొంకరాయికి చెందిన ఆటో డ్రైవర్, తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్, క్లీనర్‌లను అరెస్టు చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి లావణ్య తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐలు డి.అప్పారావు, రవిశంకర్, ఐఎన్ఎస్.బాలాజీ, సిబ్బంది ఉన్నారు.

తునిలో పోలీస్ కార్డన్ సెర్చ్

పత్రాలు లేని 23 బైక్‌ల స్వాధీనం

తునిరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గంజాయి, సారా విక్రయాలు పెరిగిపోయాయని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కాకినాడ జిల్లా తుని పోలీసులు ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 4 గంటల నుంచి 7గంటల వరకు పట్టణాన్ని జల్లెడ పట్టారు. సీఐ గీతా రామకృష్ణ, ఎస్ఐ విజయ్‌బాబు, కోటనందూరు ఎస్ఐ టి.రామకృష్ణ, తుని టౌన్, రూరల్ పోలీసులతో పాటు కాకినాడ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు ప్రధాన కూడళ్లల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానం ఉన్న ఇళ్లను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 23 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కేసులు నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు.



తునిలో బైక్‌లను స్వాధీనం చేసుకున్న పట్టణ పోలీసులు

రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా బ్రాంచి గోల్డెన్ జూబ్లీ వేడుకలు



గోల్డెన్ జూబ్లీ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్రాంచి 50వ గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఆదివారం కాకినాడలోని కార్యాలయంలోని ఆవరణలో ఘనంగా నిర్వహించారు. జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలషుల సమక్షంలో ప్రత్యేక సంచికను (సావనీర్) ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన పిఠాపురం విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి ఉమర్ ఆలీషా మాట్లాడుతూ సంఘం 50 వసంతాలు పూర్తి కావడం చాలా ఆనందం కలిగించిందన్నారు. ఉద్యోగి కాకపోయినా గౌరవంతో ఆహ్వానించినందుకు అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగుల సేవలను విస్తరించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కా ర్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి సాలగ్రామ లక్ష్మి ప్రసన్న, టీడీపీ నాయకుడు మీసాల రాజు, చలపతి నాయుడు, కృపారత్నం, ఏటివోడీ అపర్ణ ప్ర సంగించారు. 50 ఏళ్లలో సంఘం సేవలను, కృషిని కొనియాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీఎస్ఎన్బి శాస్త్రీ, జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం, జిల్లా ప్రధాన కార్యదర్శిటి నూకరాజు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఇబ్రహీం, సరోజిని రాష్ట్ర కార్యదర్శి షాజీదా హాజరయ్యారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. అంతకుముందు 50 ఏళ్ల క్రితం ఏర్పాటైన సంఘం సాధించిన విజయాలను కార్యవర్గం సభకు తెలియజేసింది.

శివాలయాల్లో లక్ష బిల్వార్చన పూజలు

అంబాజీపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరం శివాలయంలో లక్షబిల్వార్చన పూజ నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.

పొలాల్లో మురుగునిల్వ లేకుండా చూసుకోవాలి

అంబాజీపేట, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు వరి పొలాల్లో ముంపునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ధర్మప్రసాద్ సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంట పడిపోతే నిలబెట్టుకుని ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు.

మొంథా తుఫాన్.. ఎదుర్కొనేందుకు సన్నద్ధం



అంతర్వేది ఫిషింగ్ హార్బరును పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

- గ్రామాల్లో అధికారుల పర్యటన
- ముందస్తు చర్యలపై సూచనలు

అమలాపురం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు అధికారులంతా సర్వసన్నద్ధంగా ఉండాలని సాంఘిక సంక్షేమశాఖ జిల్లా సాధికారిత అధికారిణి, మండల ప్రత్యేకాధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి పేర్కొన్నారు. అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశానికి తహశీల్దార్ వాసా ఎస్.దివాకర్ అధ్యక్షత వహించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి డి.రాంబాబు, పట్టణ సీఐ వి.వీరబాబు, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు పాల్గొని వివిధ శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

అందుబాటులో ఉండాలి

అంబాజీపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి జయచంద్రగాంధీ, మండల ప్రత్యేకాధికారి బోసుబాబు సూచించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మండల అధికారులతో ఆదివారం తుఫాన్ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈసందర్భంగా ప్రత్యేకాధికారి జయచంద్రగాంధీ మాట్లాడుతూ తుఫాన్ తీవ్రత అధికంగా ఉంటుందని, గ్రామాల్లో ప్రతి అధికారి అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియచేసి ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యుత్, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. మూడు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సమావేశంలో తహశీల్దారు చినబాబు, ఎంపీడీవో మమత, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

పి.గన్నవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి డీఆర్‌డీఏపీడీ టి.జయచంద్రగాంధీ సూచించారు. వివిధ శాఖల అధికారులతో తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. మండలంలోని తుఫాన్ షెల్టర్లను శుభ్రంచేసి విద్యుత్ సౌకర్యం, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యాధికారులు, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.మల్లికార్జునరావు, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో ఎం.మధుసూదనరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జె.కళ్యాణచక్రవర్తి, పంచాయతీరాజ్ జేఈ కృష్ణంరాజు, వైద్యాధికారి వైవీ ప్రియాంక, ఏంఈవో-2 సీహెచ్ వీరభద్రా నందం, ఏపీఎం నాగమణి, ఆర్ఐ డాంఘే, అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులు వేటకు వెళ్లవద్దు

అంతర్వేది, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి అన్నారు. అంతర్వేది పల్లిపాలెం తుఫాన్ ఆశ్రయ భవనాన్ని, మినీ ఫిషింగ్ హార్బరును ఆమె ఆదివారం పరిశీలించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలన్నారు. మండల రెవెన్యూ, పోలీసు, వివిధ శాఖల అధికారులతో మాట్లాడి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. తాగునీరు, శానిటేషన్ తదితర అంశాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ దుర్గాశ్రీనివాస్, స్థానిక నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

ముమ్మిడివరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు మొంథా తుఫాను ముప్పు పొంచి ఉన్నందున అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సుబ్బరాజు సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను కాకినాడ పరిసరాల్లో తీరాన్ని దాటే అవకాశం ఉన్నందున ముమ్మిడివరం నియోజకవర్గంపై తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసిందన్నారు. తీర గ్రామాల్లో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఉండేందుకు ముందస్తుగా అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని, అన్నిశాఖల ప్రభుత్వ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లండి

మామిడికుదురు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని మండల ప్రత్యేకాధికారి కె.వేణుగోపాల్ సూచించారు. మొంథాతుఫాను నేపథ్యంలో ప్రత్యేకాధికారి సుముద్ర తీరప్రాంత గ్రామం కరవాకలో ఆదివారం పర్యటించి స్థానికంగా ఉన్న తుఫాన్ షెల్టర్‌ను పరిశీలించారు. మంగళవారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సముద్ర తీరప్రాంతం, గోదావరి నదీ తీరంలోని లంకగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కరవాక రేవులో ప్రయాణాలను నిలిపివేశామని తెలిపారు. మండల పరిధిలో ప్రతీ గ్రామంలో మైకు ద్వారా తుఫాను హెచ్చరికలు జారీచేసినట్టు తెలిపారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో అడబాల శ్రీనివాసరావు, ఆర్ఐ ఇబ్రహీం, మెరైన్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాజోలు, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికలతో మండలంలో పలు ప్రాంతాలను డీఎల్పీవో బొజ్జిరాజు, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్ ఆదివారం పరిశీలించారు. కాట్రేనిపాడు, కాట్రేనిపాడులంక, పొన్నమండ, కడలిలో సురక్షిత వసతిప్రాంతాలు పరిశీలించారు. తుఫాను హెచ్చరికలు ఉన్నందున ప్రజలందరూ సురక్షిత నివాసాల్లో ఉండాలని కోరారు. తుఫాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని డీఎల్పీవో బొజ్జిరాజు తెలిపారు. ఆయన వెంట ఏవో ఎంవీ సత్యనారాయణ, వీఆర్వోలు, సెక్రటరీలు తదితరులు ఉన్నారు. మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రాజోలు నియోజకవర్గ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య కోరారు. నియోజకవర్గంలో తీరప్రాంత గ్రామాల ప్రజలు, మత్స్యకార కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. ప్రజలకు ప్రభుత్వం, కూటమి నాయకులు అండగా ఉంటామన్నారు.

రంగా ఆశయసాధనకు యువత కృషి చేయాలి



వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి, రంగా తనయుడు వంగవీటి రాధా

పి.గన్నవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహనరంగా బతికుంటే రాష్ట్రానికి సీఎంగా చూసే వాళ్లమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. బెల్లంపూడిలో ఆదివారం జరిగిన శ్రీరాధ రంగమిత్ర మండలి ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కాపు ఉద్యమ నాయకుడు ఆకుల రామకృష్ణ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే మాట్లాడారు.బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వంగవీటి మోహనరంగా ఎంతో కృషి చేశారన్నారు. రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ పార్టీ లు, కులాలకు అతీతంగా నిరుపేదల కోసం పాటు పడిన మహోన్నత వ్యక్తి రంగా అని కొనియాడారు. నాన్న మృతిచెంది మూడు దశాబ్దాలు గడుస్తున్నా, ఇంకా అభిమానుల గుండెల్లో గూడు కట్టుకున్నారన్నారు. ఈసందర్భంగా బెల్లంపూడి యువతను, విగ్రహం అందించిన దాత కొమ్మూరి మల్లిబాబును ఆయన అభినందించారు. అనంతరం మిత్ర మండలి సభ్యులు నాయకులను సన్మానించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బండి మహాలక్ష్మి, కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు, నగరం మార్కెట్ కమిటీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, హ్యాండ్ క్రాఫ్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్‌డీఎస్ ప్రసాద్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా స్వరూపదేవి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరే షన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, కాపు ఉద్యమ నాయకులు ఆకుల రామకృష్ణ, నల్లా పవన్‌కుమార్, కల్వకొలను తాతాజీ, జక్కంపూడి గణేష్, నల్లా అజయ్, సంజయ్, నాయకులు పీవీఆర్ నాయుడు, శేరు శ్రీనుబాబు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ప్రొఫెసర్ సాయిబాబా కృషి



మాట్లాడుతున్న జాతీయ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రవిచంద్ర

అమలాపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు పేద వర్గాల దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా అమలాపురం నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఉద్యమించిన ప్రజా హక్కుల పోరాట యోధుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగసాయిబాబాను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని జాతీయ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రవిచంద్ర పిలుపునిచ్చారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం పౌర హక్కుల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత సాయిబాబాకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారు నివాళులర్పించారు. పౌరహక్కుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జిల్లెల్ల మనోహరం అధ్యక్షతన జరిగిన సభకు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రవిచంద్రతో పాటు సాయిబాబా సోదరుడు మాధవ్ మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. భవిష్యత్తులో జరిగే అన్ని రకాల పోరాటాల్లో ప్రొఫెసర్ సాయిబాబు సజీవంగా నిలుస్తారన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, పీటీఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, రైతుకూలీ సంఘం ప్రతినిధి కొండా దుర్గారావు, ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి జి.శ్రీనివాస్, సామాజికవేత్త భరద్వాజ్ తదితరులు ప్రసంగించారు. సాయిబాబా కుటుంబ సభ్యులైన గంగుమళ్ల శ్రీనివాస్, అమలదాసు బాబూరావు, గిడ్ల వెంకటేశ్వరరావు, కాళిదాసు, జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు తదితరులు అమలాపురం నుంచి సాయిబాబా అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన విధానాలను వివరించారు.

అప్రమత్తంగా ఉండండి.. సహాయం అందిస్తాం: ఎమ్మెల్యే

ఉప్పలగుప్తం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రజలకు సూచించారు. తుఫాను ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండవచ్చన్నారు. తుఫాను సహాయక చర్యలకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసిందన్నారు. పునరావాస కేంద్రాలకు తరలించేందుకు తగిన ఏర్పాట్లు జరిగాయన్నారు. ఆదివారం ఆయన ఎన్డీఆర్ఎఫ్, పోలీసు, మెరైన్ పోలీసు, ఇతర అధికార యంత్రాంగంతో తీరగ్రామాలైన ఎస్.కొత్తపల్లి, రాఘవులపేట, వాసాలతిప్పలో పర్యటించారు. అక్కడి ప్రజలను తుఫాను పట్ల అప్రమత్తం చేశారు. ఎస్.కొత్తపల్లి తుఫాను షెల్టర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ వాసా దివాకర్, ఎంపీడీవో డి.కృష్ణ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాట్లపై ఎమ్మెల్యేకు వివరించారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో 24గంటలు కంట్రోల్ రూమ్‌లు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, స్టేట్ ఆక్వా డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, వాటర్ డీసీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు, వైస్ చైర్మన్ గుత్తుల శ్రీనివాస్, ఫిషర్‌మెన్ డైరెక్టర్ లంకే భీమరాజు, కూటమి నాయకులు గొలకోటి చిన్నా, పోలిశెట్టి శివాజీ, ఎస్.చెల్లయ్యనాయుడు, ఇసుకపట్ల రఘుబాబు, ఈదరపల్లి శ్రీనివాసరాజు, బూసి బుజ్జిదొర, మల్లాడి వెంకటరమణ, పలచోళ్ల పద్మనాభం, పలచోళ్ల బుజ్జి పాల్గొన్నారు.



ఎస్.కొత్తపల్లి తుఫాన్ షెల్టర్ వద్ద మత్స్యకారులకు జాగ్రత్తలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

తుఫాను విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నియోజకవర్గ అభివృద్ధి అధికారి రాంబాబు సిబ్బందిని హెచ్చరించారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా విధులను కేటాయించారు. పంచాయతీ కార్యాలయాల్లో సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్తు, మత్స్యశాఖ అధికారులు తాము తీసుకుంటున్న చర్యలపై వివరించారు. తాగునీటి ప్రాజెక్టుల వద్ద జనరేటర్లు ఏర్పాటు చేసినట్టు ఏఈ సురేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ లలిత, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల హెచ్చరిక

అంతర్వేది, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో దూసుకువస్తున్న మొంథా తుఫాన్ కాకినాడ వద్ద తీరం దాటే అవకాశం ఉన్నందున అంతర్వేది తీర ప్రాంత ప్రజలు, సఖినేటిపల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ దుర్గాశ్రీనివాస్ అన్నారు. ఈనెల 27, 28, 29 తేదీలు అత్యంత కీలకమని, గంటకు అంతర్వేది బీచ్‌లో స్నానాలకు వెళ్లరాదని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, ప్రజలంతా తుఫాను ప్రభావం తగ్గే వరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.



అంబాజీపేట: మొసలపల్లి వద్ద ముంపునీటిలో పడిపోయిన వరిచేలు

పద్మ అవార్డు గ్రహీతకు సన్మానం

మామిడికుదురు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో పద్మ ప్రతిభ అవార్డు అందుకున్న మామిడికుదురుకు చెందిన పంచాంగకర్త, వాస్తు సిద్ధాంతి కారుపర్తి కోటేశ్వరరావును స్థానికులు ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో జగ్గన్నపేట దేవాంగ సంక్షేమ సంఘ సభ్యులు ఆయన్ను సన్మానించారు. జాతీయ అవార్డు అందుకుని గ్రామానికి మంచిపేరు తీసుకువచ్చారని, భవిష్యత్‌లో మరిన్ని అవార్డు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యక్కల మెహర్‌బాబా, లక్కింశెట్టి సాయిబాబు, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రత్యేక సేవా శిబిరం

మామిడికుదురు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు దీప్తి కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ఏడు రోజులు ప్రత్యేక సేవా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కళాశాల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ తెలిపారు. కొమరాడ గ్రామంలో ఏడు రోజులు జరిగే శిబిరంలో పరిశుభ్రత, అక్షరాస్యతపై అవగాహన సదస్సులు, మొక్కలు నాటడం, అంటు వ్యాధులపై ప్రజలకు అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.సుబ్బారావు, ప్రిన్సిపాల్ ఎం.రంగారావు పాల్గొంటారని తెలియచేశారు.

అమలాపురంలో విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు బ్రాంచి



మాట్లాడుతున్న విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ సత్యనారాయణ

అమలాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు 58వ బ్రాంచిని అమలాపురంలో ఈనెల29వ తేదీన ప్రారంభిస్తున్నట్టు బ్యాంకు చైర్మన్ జేవీ సత్యనారాయణమూర్తి వెల్లడించారు. అమలాపురంలోని శ్రీదేవి మార్కెట్ సమీపంలో బ్యాంకు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 110ఏళ్ల ప్రస్థానంలో దేశంలో 1472అర్బన్ బ్యాంకుల్లో విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ షేర్ క్యాపిటల్‌లో మూడో స్థానంలో నిలిచిందన్నారు. తెలుగురాష్ట్రాల్లో ఇప్పటికే 56బ్రాంచీల ద్వారా సామాన్యులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. గత ఏడాది ఆర్జించిన నికర లాభం రూ.71.77కోట్లు అని వెల్లడించారు. ఈఏడాది కొత్తగా అమలాపురంతో పాటు నూజివీడు, తెనాలి, విశాఖ, హైదరాబాద్‌లో మరికొన్ని బ్రాంచీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈఆర్థిక సంవత్సరం బ్యాంకు రూ.8,600కోట్ల లావాదేవీలు లక్ష్యంగా నిర్ణయించుకున్నామని, అమలాపురంలో ఏర్పాటుచేసే బ్రాంచి ద్వారా రూ.100కోట్ల లావాదేవీలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. 110 ఏళ్లప్రస్థానంలో మానం ఆంజనేయులు చైర్మన్‌గాఏర్పాటైన విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు రూ.కోటితో ప్రారంభమైందని, ఈనెల28న 58వ బ్రాంచిని అమలాపురంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రారంభిస్తారని, సభాధ్యక్షునిగా చైర్మన్ సత్యనారాయణ వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బ్రాంచి వైస్‌చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామకృష్ణారావు, సీఈవో వీవీబీ వరలక్ష్మితో పాటు స్థానిక బ్రాంచి మేనేజర్‌తో సహ అనేకమంది పాల్గొన్నారు.

వలస మత్స్యకారులకు ఉపాధి కరువు



చేపల వేట లేక ఖాళీగా ఉన్న మత్స్యకారులు

ఉప్పలగుప్తం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టి.చల్లపల్లి పంచాయతీ వాసాలతిప్ప సముద్ర తీరాన ఏటా సీజన్ అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి మత్స్యకారులు వలస వచ్చి బోట్లపై సముద్రంలో చేపల వేటకు వెళ్తారు. తుఫాను హెచ్చరికలతో రెండు రోజులుగా చేపల వేటకు సెలవు ప్రకటించారు. బోట్లను తీరంలో లంగరేసి, తమ నివాసాల వద్ద ఖాళీగా ఉంటున్నారు. ఆదివారం మండల అధికారులు మత్స్యకారులను కలిసి తాము చెప్పేవరకు చేపల వేటకు వెళ్ళవద్దని విజ్ఞప్తి చేశారు. తీరం నుంచి పునరావాస కేంద్రానికి రావలసిందిగా సూచించారు.

ఘనంగా సూర్యబలిజ కార్తీక వనసమారాధన

అమలాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని సూర్యబలిజ సంఘం ఆధ్వర్యంలో 22వ కార్తీక వనసమారాధన కార్యక్రమం ఆదివారం ఈదరపల్లిలోని ఉమామహేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. సూర్యబలిజ సంఘానికి చెందిన ప్రతినిధులు, మహిళలు భారీ సంఖ్యలో హాజరై వనసమారాధనలో పాల్గొన్నారు. తొలుత ఉసిరిచెట్టు వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం కమిటీ ఆధ్వర్యంలో పిల్లలు, పెద్దలకు ఏర్పాటుచేసిన ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా సంఘీయులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో సూర్యబలిజ సంఘం గౌరవాధ్యక్షుడు కాశే ఆదిపట్టాభిరామయ్య, అధ్యక్షుడు కాశే దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు సత్తిబాబు, కాశే గణేష్, సుధాకర్, వాల్మీకి సాయిబాబు, యండమూరి సత్యనారాయణల ఆధ్వర్యంలో పలువురు పాల్గొన్నారు.

16వ రోజు రిలే నిరాహార దీక్షలు

ముమ్మిడివరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో బస్టాండు ఆక్రమణలు తొలగించి బస్టాండులోకి బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 16వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని బత్తి నరసింహమూర్తి, వడ్డి దేవిశ్రీకృష్ణలతో పాటు పలువురు సందర్శించి తమ సంఘీభావాన్ని తెలిపారు.

హిందూ ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో పూజలు

ముమ్మిడివరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాపచింతలపూడిలోని శ్రీఉమావల్లభేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హిందూ ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి గణపతి హోమం, లక్ష బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, స్వామివారికి పూర్ణాహుతి వంటి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం

ముమ్మిడివరం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు మొంథా తుఫాను ముప్పు పొంచి ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మంగళవారం సాయంత్రానికి తుఫాను కాకినాడ-తుని మధ్య తీరాన్ని దాటవచ్చునని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముమ్మిడివరం మండలంలో 24పునరావాస కేంద్రాలు సిద్ధం చేశారు. ప్రత్యేకాధికారి మధుసూదనరావు, పి.గౌతమ్‌ల పర్యవేక్షణలో తహశీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో దీక్షితులు, అధికార యంత్రాంగంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజల ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో మైకులద్వారా ప్రచారం నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని ప్రజలు పూరి గుడిసెల్లోను, పైకప్పులు బలహీనంగా ఉన్న ఇళ్లల్లోను నిద్రించరాదని సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సంబంధించి పలు సూచనలు జారీ చేశారు.

అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం



పీపీపీ విధానం కార్యక్రమంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, నాయకులు

రాజోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి లక్ష్యంగా పీపీపీ విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. రాజోలులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీనివాస్ రాజోలులో పోస్టర్లను గోడలకు అంటించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 17మెడికల్ కళాశాలలను పూర్తిస్థాయిలో నిర్మాణాలు పూర్తిచేసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజల్లోకి తప్పుడు సమాచారాన్ని పంపిస్తూ, పేద బడుగు, బలహీనవర్గాల ప్రజల్ని మోసం చేస్తూ కోటి సంతకాల సేకరణ చేయడం విడ్డూరంగా ఉందని శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో చాగంటి స్వామి, పామర్తి రమణ, పిల్లి శ్రీరామమూర్తి, అడబాల విజయ్, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలి దేవర వెంకన్నబాబు, కోళ్ల వెంకన్న, కట్టా సూరిబాబు, మోకా పార్వతి, మటపర్తి లక్ష్మి, నార్కేడుమిల్లి విష్ణు, కొత్తపల్లి విజయలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, కడలి వెంకటరమణ, రావి మురళీ, పొన్నమండ కొండబాబు, ఆరుమిల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మలికిపురం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ రాజోలు నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, ప్రజలంతా తుఫాన్ నేపథ్యంలో ఇళ్ల వద్దనే ఉండాలన్నారు. భారీ వర్షాలకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బీచ్‌ల వద్దకు ఎవరూ వెళ్లవద్దన్నారు.

ఆరోగ్య పరిరక్షణ, ఆహార భద్రత కల్పనకు చర్యలు



బలుసుతిప్పలో తుఫాన్ భవనం పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కాట్రేనికోన, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాను పునరావాస కేంద్రాల్లో తీరప్రాంత ప్రజలకు తక్షణ భద్రత, ఆరోగ్య పరిరక్షణ, ఆహార భద్రత కల్పనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం బలుసుతిప్పలో బహుళప్రయోజన తుఫాన్ ఆశ్రమ భవనాన్ని ఆయన సందర్శించారు. పునరావాస కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పునరావాస కేంద్రంలోని బాధితులు తాత్కాలిక నివాసానికి అన్నిఏర్పాట్లు చెయ్యాలన్నారు. వంటశాల పరిశుభ్రంగా ఉంచాలన్నారు. బాధితులకు ఆహారం, తాగునీరు, పిల్లలకు పాలు సరఫరా చెయ్యాలన్నారు. తాత్కాలిక టాయిలెట్లు, శానిటేషన్ సౌకర్యం కల్పించాలని అన్నారు. పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చెయ్యాలన్నారు. తహసీల్దార్ రవికిరణ్, ప్రత్యేక అధికారి జి.మమ్మీ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో ఎందరికో మేలు

మలికిపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు అందిస్తున్న సహాయం ఎంతగానో తోడ్పడుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద 38 మందికి రూ.32లక్షల చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు 600మందికి రూ.5కోట్లు సాయం అందించామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించని పేదలకు ఈలబ్ధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, లింగోలు పెద్దబ్బులు, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మాలే శ్రీనివాసనగేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లక్షపత్రి పూజ

అమలాపురం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇందుపల్లి శ్రీఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజ ఘనంగా జరిగింది. శ్రీబాలభక్త గణపతి సేవాసంఘం ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ నిర్వహించారు. గొర్తి సాయి ఆచార్య బ్రహ్మత్వంలో దీక్షితుల ఫణిపూర్ణయ్యా-సూర్యకళ దంపతులు పీఠార్చనతో గణపతి పూజ, అభిషేకం, పత్రిపూజ, కుంకుమ పూజ నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అఖండ అన్నసమారాధన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి చెప్పారు. ప్రతీ సోమవారం ఆలయం వద్ద అన్నసమారాధన జరుగుతుందన్నారు. చింతా అత్తిలింగం, కారుపర్తి శ్రీదేవి, నల్లా గీత, బిళ్ల శ్యామల, బత్తుల దుర్గ తదితరులు అన్నప్రసాద వితరణకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ

రాజోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శివకోడులో శ్రీమంగెన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో ప్రతిభ గల కాపు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. రాజోలు తాలూకా పరిధిలోని నాలుగు మండలాల నుంచి 290మంది ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహంగా గుంటూరుకు చెందిన తులసీ సీడ్స్ అధినేత తులసి రామచంద్రప్రభు రూ.6లక్షలు, ఉద్యోగస్థుల నుంచి సేకరించిన రూ.6లక్షలు మొత్తం రూ.12లక్షలు అందజేశారు. అనంతరం రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ, ఉద్యోగ అవార్డు గ్రహీతలను సన్మానించారు. కార్యక్రమంలో రేకపల్లి నాగేశ్వరరావు, అడబాల సుబ్బారావు, సంగం బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయంలో భక్తుల రద్దీ

అంతర్వేది, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం కావడంతో అంతర్వేది పుణ్యక్షేత్రానికి భక్తుల తాకిడి మొదలైంది. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి దర్శనానికి బారులు తీరారు. కార్తీకమాసం మొదటి ఆదివారం కావడంతో అయ్యప్ప భక్తులు స్వామిని దర్శించుకుని నిత్యాన్నదానంలో ప్రసాదం స్వీకరించారు. భక్తుల రద్దీతో బఫే సిస్టం ద్వారా అన్నప్రసాదం అందించారని ఆలయ ఏసీ ఎంకేటీఎస్వీ ప్రసాద్ తెలిపారు.

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

అమలాపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మారుతీ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా నిర్వహించిన ఎంపిక పోటీల్లో అమలాపురం పవర్‌కిక్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు చీఫ్‌కోచ్ పడాల అంజి తెలిపారు. కిక్‌బాక్సింగ్ లీగ్-2025-26 రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో 150మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో అమలాపురం నుంచి అడపా రవిశంకరి (48 కిలోలు), మోకా కరుణమిత్ర (28 కిలోలు), బొలిశెట్టి యశస్విని (56 కిలోలు), పిల్లి ధన్యశ్రీ (36 కిలోలు), కుంచే లెనిన్ (56కిలోలు) విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించారు. వీరంతా నవంబరులో విశాఖపట్నంలో జరిగే సౌతిండియా కిక్ బాక్సింగ్ పోటీలకు ఖేలో ఇండియా తరపున ఎంపికైనట్టు కోచ్ చిక్కం సురేష్ తెలిపారు. స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.

ఆపన్నులకు సీఎం సహాయ నిధి బాసట

మామిడికుదురు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.11లక్షల చెక్కులను పాశర్లపూడిలో ఆదివారం జనసేన మండలశాఖ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ కమిటీ సభ్యుడు జాలెం శ్రీనివాసరాజా పంపిణీ చేశారు. ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి బాధితులకు రక్షణగా నిలుస్తుందన్నారు. ఎంపీటీసీలు కొమ్ముల జంగమయ్య, వాసంశెట్టి వెంకటరమణ, సొసైటీ అధ్యక్షుడు మందా గాంధీ, టీడీపీ నాయకులు జాలెం సుబ్బారావు, చుట్టుగుళ్ల కిశోర్, కోళ్ల సురేష్, బొక్కా త్రిమూర్తులు, జనసేన నాయకులు బళ్ల సతీష్, గుబ్బల పండుపాల్గొన్నారు.




కె.గంగవరంలో గుడిసెలో ఉన్న వారిని పునరావాస కేంద్రానికి రావాలని కోరుతున్న తహశీల్దార్ శ్రీరామప్రసాద్. పక్క చిత్రంలో కపిలేశ్వరపురంలో విత్తనాల ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ఆలయంలో భక్తుల కిటకిట

అంతర్వేది, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం కావడంతో అంతర్వేది ఆలయానికి భక్తుల తాకిడి మొదలైంది. భక్తజనం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి బారులుతీరారు. కార్తీక మాసం మొదటి ఆదివారం కావడంతో అయ్యప్ప భక్తులు స్వామిని దర్శించుకుని నిత్యాన్నదానంలో ప్రసాదం స్వీకరించారు.

తుఫాన్ హెచ్చరికలపై అప్రమత్తంగా ఉండాలి

• రైతులకు, ప్రజలకు అధికార యంత్రాంగం పలు సూచనలు • పునరావాస కేంద్రాలకు తరలిరావాలని వినతి

కె.గంగవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ శ్రీరామ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గుడిసెలో ఉంటున్న వారి వద్దకు వెళ్లి తుఫాన్ తీవ్రతను తెలిపి పునరావాస కేంద్రాలకు తరలి రావాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ 26 గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
తహసీల్దార్ శ్రీనివాస్

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి.శ్రీనివాస్ సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయించామని ఆయన తెలిపారు.

తుఫాను పట్ల రైతుల బెంబేలు: మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆదివారం వాతావరణం అనుకూలించడంతో ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. కోసిన విత్తనాల ధాన్యం వర్షాలకు రంగు మారిందని రైతులు వాపోతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతుల్లో కలవరం

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం తీవ్రత భారీగా ఉంటుందని వస్తున్న హెచ్చరికలతో మండలంలోని వరి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నది. గత వారం అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు అనేక ప్రాంతాల్లో పంట నేలకొరిగింది. లోతట్టు ప్రాంతాల్లో వరి పంట నీటమునిగి ఇప్పటికే అలానే ఉన్నాయి. వరి పంటతోపాటు ఆయా లంక గ్రామాల్లో అరటి, కంద తదితర పంటలతో పాటు అనేక వాణిజ్య పంటలు వేలాది ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇప్పుడు తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటే ఆయా పంటలకు నష్టం అధికంగా ఉంటుందని అధికారులు అంచన వేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ అన్నారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేస్తూ తుఫాన్ వల్ల 27, 28, 29 తేదీల్లో బలమైన గాలులతో పాటు భారీ వర్షాలు కురుస్తాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలెవరూ బయటకు రాకుండా ఇళ్లలో ఉండాలన్నారు. తుఫాన్ దృష్ట్యా కొత్తపేటలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు.



రావులపాలెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సీహెచ్‌కేవీ చౌదరి

అధికారుల సూచనలు పాటించాలి: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారుల సూచనలను ప్రజలు పాటించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. ఆదివారం వాడపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ఆస్తి, ప్రాణం నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



ఎమ్మెల్యే బండారు

అధికారులతో సమావేశం

మండపేట (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండపేట నియోజకవర్గ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి ప్రజలకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గానికి చెందిన తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, వ్యవసాయశాఖ, పంచాయతీ కార్యదర్శులు విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలతో ఆమె సమావేశం జరిపారు. తుఫాన్ కారణంగా ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ఇప్పటికే తుఫాన్‌పై ఆయా గ్రామాల్లో ప్రచారం చేశామన్నారు. ఈ సమావేశానికి మండపేట నియోజకవర్గ పరిధిలో గల మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల ఎంపీడీవోలు కె.సత్యనారాయణ, బానోజీ, కీర్తనతోపాటు డిప్యూటీ ఎంపీడీవోలు దాసరి శ్రీనువాస్, పి.వెంకటరత్నం, తహసీల్దార్‌లు కె.శ్రీనివాస్, మండపేట డీటీ మోహర్‌బాబా, విద్యుత్‌శాఖ ఏఈ సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ ఏఈలతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారం: తుఫాన్ హెచ్చరికలపై ఆయా గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మైక్‌తోపాటు టాంటాం వేస్తూ ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచిస్తున్నారు.

కమిషనర్ రంగారావు సమీక్ష

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా సమాయత్తంగా ఉండాలని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అధికారులకు పిలుపునిచ్చారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఆయన తన చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. తుఫాన్ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో 24 గంటలపాటు సేవలందించేలా కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోగల సచివాలయ, మున్సిపల్ ఉద్యోగుల సెలవులను రద్దు చేశామని ఆయన తెలిపారు. ఉద్యోగులంతా విధులకు హాజరు కావాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. తుఫాన్ వల్ల ఎదురయ్యే పరిస్థితులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. మున్సిపల్ డీఈఈ శ్రీనువాస్, ఆర్‌వో శాస్త్రి, ఏఈ పవన్‌కుమార్, అనుషాలక్ష్మి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, కె.రమ్య, పట్టణ ప్రణాళిక అధికారి ఎం.సత్తిరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణలను పర్యవేక్షణ అధికారులుగా నియమించామన్నారు. ప్రజలు కంట్రోల్ రూం నెంబర్ 08855 233028 ఫోన్ చేసి సహాయం పొందవచ్చని కమిషనర్ చెప్పారు. పట్టణంలో మూడు తాత్కాలిక తుఫాన్ షెల్టర్‌లను ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని డొక్కా సీతమ్మ, భవనం, టౌన్‌హాల్, గొల్లపుంత కాలనీలో వున్న మహిళాశక్తి భవనాల్లో తుఫాన్ బాధితులకు వసతి ఏర్పాట్లు చేశామన్నారు. పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే 98499 86203, మంచినీటి సరఫరాకు అంతరాయం కలిగితే 98499 86203, శానిటేషన్‌కు సంబంధించి 98499 86209 ఫోన్‌లకు ప్రజలు కాల్ చేయాలన్నారు. అధికారుల సమావేశంలో మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మండపేట మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ రంగారావు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి సీహెచ్‌కేవీ చౌదరి అన్నారు. రావులపాలెం మండల పరిషత్ మీటింగ్ హాలులో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ మైక్‌లు, దండోరాల ద్వారా ప్రచారం చేయాలన్నారు. రక్షిత మంచినీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అన్నదాతల ఆందోళన: పంట పొలాలు ఈనిక దశకు వచ్చిన తరుణంలో తుఫాన్ హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట ఈనిక దశలో ఉన్న తరుణంలో వర్షం కురిస్తే దిగుబడి తీవ్రంగా తగ్గిపోయే అవకాశం ఉందని రైతులంటున్నారు.



ఆలమూరులో గోదానం చేస్తున్న దృశ్యం

వైభవంగా గణపతి హోమం

ఆలమూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఆదివారం ఆలమూరుకు చెందిన వ్యాపారవేత్త వంటిపల్లి పాపారావు విశాలాక్షి దంపతుల అధ్వర్యంలో గోదానం నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా గణపతి హోమం, రుద్రహోమం, సూర్య నమస్కారాలు, మృత్యుంజయ హోమం, నవగ్రహ హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



కపిలేశ్వరపురంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం గ్రామంలోని శ్రీ అగస్తేశ్వర, పాపవినాశేశ్వర స్వామివార్ల ఆలయంలో ఆదివారం చండీహోమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంగర గ్రామానికి చెందిన కె కె.రాజు దంపతులతో వేద పండితులు వై.కిరణ్‌శర్మ స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం చండీ హోమాన్ని వేదమంత్రోశ్చరణల మధ్య శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ధర్మకర్తల నియామకంలో జాప్యం ఎందుకో?

ఆత్రేయపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి ఆలయానికి వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న భక్తులతో అంతకంతకు రద్దీ పెరుగుతోంది. స్వామివారి వార్షిక ఆదాయం రూ.30 నుంచి రూ.35 కోట్లకు చేరుకుంది. గ్రేడ్-1 స్థాయిలో ఉన్న ఈ ఆలయం ఏడాదిన్నర క్రితమే డిప్యూటీ కమిషనరు హోదాకు చేరింది. మరో ఏడాదిలో ఆర్జేసీ స్థాయికి చేరుకోనుంది. రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలతో ఈ క్షేత్రం సమానస్థాయిలో చోటు దక్కించుకోవడంతో ఛైర్మన్ గిరి పోస్టు రాష్ట్రస్థాయి జాబితాలోకి చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా నేటికీ ధర్మకర్తల నియామకం చేపట్టలేదు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ధర్మకర్తల మండలి నియామకంలో జాప్యం జరగడంపై ఆశావహులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సిఫార్సు మేరకు ఆత్రేయపురం క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ముదునూరి వెంకట్రాజు పేరును సిఫార్సు చేశారు. మరోవైపు ఛైర్మన్ గిరి కోసం ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే సూచించిన వెంకట్రాజు పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ధర్మకర్తల మండలి నియామకం రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాల నుంచి చోటు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఛైర్మన్ ఎంపిక ఖరారు కావడం ధర్మకర్తల మండలి నియామకం కొలిక్కి రాకపోవడం ప్రభుత్వం జీవోను విడుదల చేయడంలో జాప్యం ఏర్పడుతున్నది. ఈ నేపథ్యంలో ఆశావహులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. పార్టీ అధిష్టానం 11 మంది ధర్మకర్తలను బయట ప్రాంతాల నుంచి ఎంపిక చేయడం మరో ఆరుగురు వ్యక్తులను నియోజకవర్గ స్థాయిలో ఎంపిక చేస్తున్నట్లు సమాచారం. టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి ధర్మకర్తలను ఎంపిక చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ధర్మకర్తల మండలి నియామకం జాప్యం ఏర్పడటంతో కూటమి శ్రేణులు సమయం వృథా అవుతుందని మదన పడుతున్నారు. ఏడాదిన్నర కావస్తున్నా నామినేటెడ్ పదవుల పంపకాలలో జాప్యం జరగడం మరో రెండు సంవత్సరాలు పదవులు పొందాలనుకున్న ఆశావహులు పార్టీ అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి

రబీ ధాన్యం విక్రయంలో హమాలీ చార్జీలు పడేదెప్పుడో?

కె.గంగవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గత రబీ సీజన్‌లో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు కొందరికి నేటికీ హమాలీ చార్జీలు జమ కాలేదని తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ధాన్యం కొనుగోలును ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. రైతులకు ధాన్యం విక్రయించిన రోజునే సొమ్ము జమ చేశారు. హమాలీ చార్జీల విషయంలో రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. హమాలీ చార్జీల రూపంలో ధాన్యం విక్రయించిన రైతుకు క్వింటాల్‌కు రూ.22 చొప్పున వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. కొన్ని గ్రామాల్లో వాటి సొమ్ములు జమ కాలేదని తెలిసింది. కె.గంగవరం మండలంలోని పామర్రు సచివాలయం2 అనగా యండగండి రైతు సేవా కేంద్రంలో ధాన్యం విక్రయించిన పలువురు రైతులకు నేటికీ సొమ్ము జమ కాలేదని సమాచారం. ఈ రైతు సేవా కేంద్రం నుంచి గత రబీ సీజన్‌లో పలువురు రైతులు ధాన్యం విక్రయించగా కొంత మందికి మాత్రమే హమాలీ చార్జీల రూపంలో జమ అయినట్టు తెలిసింది. ఇంకొంత మంది రైతులకు రూ.1,35,590 రావాల్సి ఉందని తెలిసింది. మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు ఇంకా హమాలీ చార్జీలు జమ కాలేదని సమాచారం. వీటి కోసం ఆయా ప్రాంత రైతులు ఎదురు చూస్తున్నారు. ఒక పక్క ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండగా, రబీ సీజన్‌లో సొమ్ములు జమ కాలేదని పలువురు రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయశాఖ అధికారి ఏ. సద్గురుమూర్తిని వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళామని తెలిపారు. సాంకేతిక సమస్య కారణంగా హమాలీ చార్జీలు రైతుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని ఆయన తెలిపారు. త్వరలో ఆయా రైతుల ఖాతాల్లో హమాలీ చార్జీలు జమవుతాయని ఆయన అన్నారు.



వైసీపీ నుంచి జనసేనలోకి చేరిన ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, లీలాకృష్ణ సతీమణి అనిత

జనసేన పార్టీలో చేరిక

మండపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల ముందే వైసీపీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పలువురు టీడీపీ, జనసేన పార్టీల్లో చేరిపోతున్నారు. ఇప్పటికే మండపేట ఎంపీపీ ఉండమట్ల వాసు వైసీపీని వీడి పార్టీలో చేరారు. తాపేశ్వరం గ్రామానికి చెందిన వైసీసీ ఎంపీటీసీ 1, పిల్లా లక్ష్మి ఆదివారం జనసేన నేత రాష్ట్ర ఏపీఐడీసీ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ సతీమణి అనిత, స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో మండపేట టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరారు. ఆమెను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ఆమెను అనితతో పాటు ఎమ్మెల్యే అభినందించారు. ఎంపీటీసీతోపాటు పిల్లా సత్యనారాయణ, ఆకువేటి గణేష్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఇప్పనపాడు ఉపసర్పంచ్ కుంచే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో లక్షబిల్వార్చన పూజలు

అంబాజీపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరం శివాలయంలో లక్షబిల్వార్చన పూజ నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.









వెదురుపాక శివాలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకులు

సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

రాయవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పంచమిని పురస్కరించుకుని ఆదివారం గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ అర్చకత్వంలో గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకటేశ్వర భానుజీ, శ్రీదేవి దంపతులు పీఠలపై కూర్చుని పూజలు చేశారు. ఈసందర్భంగా సోమేశ్వరస్వామికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, లక్ష బిల్వార్చన, పార్వతి అమ్మవారికి మహిళలతో సామూహిక కుంకుమార్చనలు, సూర్య నమస్కారాలు, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు దంతుర్తి సుబ్రహ్మణ్యశర్మ, రామకృష్ణ, శాస్త్రి, రామారావు, హరిశాస్త్రి, ఇటికిరాల సుబ్రహ్మణ్యశర్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మారేడుబాకలో జాకీల సాయంతో ఇంటిని ఎత్తు చేస్తున్న దృశ్యం

జాకీల సాయంతో ఇంటి ఎత్తు పెంపు

మండపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇంటిని కూల్చకుండానే అనుకున్న మేర టెక్నాలజీతో ఇంటిని ఎత్తు చేసిన వైనమిది. వివరాల్లోకి వెళితే...మారేడుబాక పంచాయతీ పరిధిలోగల మహిళానగర్‌కు చెందిన ఒక వ్యక్తికి చెందిన ఇంటిని మూడు అడుగులు ఎత్తుపెంచేలా ఒక ప్రైవేటు సంస్థ ముందుకు వచ్చింది. ఆదివారం ఆ సంస్థ జాకీల సాయంతో మూడు అడుగుల మేర ఇంటిని పైకి లేపి ఎత్తు చేసింది. దీంతోపాటు ఇంటిని ఎత్తుచేసి మూడు అడుగుల మేర ఇల్లు దెబ్బతినకుండా ఆ సంస్థ పనులు చేసి అప్పజెప్పింది. ఈ పనులను చేసేందుకు ఆ సంస్థకు రూ.3లక్షలకు కాంట్రాక్ట్‌కు ఇచ్చినట్టు ఇంటి యజమాని తెలిపారు. ఇల్లు ఎత్తు చేసేటప్పుడు ఎటువంటి నష్టం కలగ కుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని పనిని పూర్తి చేసినట్టు వారు తెలిపారు.

కేశవరం లారీ యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

మండపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం కేశవరం లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉండమట్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కేశవరం లారీ యూనియన్ భవనంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన్ను నూతన అధ్యక్షుడిగా సభ్యులు ఎన్నుకున్నారు. శ్రీనువాస్‌తోపాటు కార్యదర్శిగా గుడ్ల ఈశ్వరరావు, కోశాధికారిగా సత్తి సుబ్బరాజులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో లారీ యూనియన్ సభ్యులు, యాజమానులు, కార్మికులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న లారీ యూనియన్ సభ్యులు







